అ'పూర్వ' సాయం

- పాఠశాలపై మమకారంతో పూర్వ విద్యార్థుల వితరణ
- రూ.2.75 లక్షలతో డైనింగ్ టేబుళ్ల ఏర్పాటు


పాలకొల్లు మండలం లంకలకోడేరు జడ్పీ ఉన్నత పాఠశాలకు డైనింగ్ టేబుల్ వితరణ చేసిన దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేయడానికి విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను పూర్వ విద్యార్థులు స్వయంగా పరిశీలించారు. మండలంలో లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దది. సుమారు 650 మంది విద్యార్థులు ఇక్కడ విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రతి రోజూ 500 మందికి పైగా విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. వీరంతా నేల మీద కూర్చుని భోజనం చేయడానికి పడుతున్న పాట్లు పూర్వ విద్యార్థులు కళ్లారా చూశారు. దీంతో పెద్ద మనస్సుతో డైనింగ్ టేబుళ్లను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు. దీని కోసం 1981–82 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన 40 మంది పూర్వ విద్యార్థులు రూ.2.75 లక్షలు విరాళంగా అందజేశారు. దీంతో భోజనశాలలో ప్రత్యేకంగా స్టీలు ఫ్రేమ్‌లతో టేబుళ్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పాఠశాలలో ఈ పనులు దాదాపు పూర్తయ్యాయి. అలాగే గతంలో పూర్వ విద్యార్థుల విరాళం రూ.3 లక్షలతో డిజిటల్ క్లాస్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా సుమారు రూ.1.50 లక్షలతో పాఠశాలలో ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు పారితోషికాలు అందజేస్తున్నారు.

సంధ్య మెరైన్స్ బెంచీల వితరణ
పూలపల్లికి చెందిన సంధ్య మెరైన్స్ నిర్వాహకులు విద్యార్థుల కోసం ఈ ఏడాది రూ.1.50 లక్షలతో 24 బెంచీలను వితరణ చేశారు.

ఆర్డీవో దాసి రాజు ప్రశంస
ఇటీవల విద్యార్థులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆర్డీవో దాసి రాజు పాఠశాలను సందర్శించారు. పూర్వ విద్యార్థుల వితరణతో నిర్మించిన భోజన బల్లలను పరిశీలించి ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థుల కోసం బెంచీల ఏర్పాటు


విద్యార్థులు నేల మీద కూర్చుని భోజనం చేయడం చూశాం. ప్రతీ ఏటా సంక్రాంతికి మా బ్యాచ్ విద్యార్థులంతా కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుంటాం. తాము చదివిన పాఠశాలకు ఏదైనా చేయాలనే నిర్ణయంతో భోజనం బల్లలు ఏర్పాటు చేశాం.
ద్రోణంరాజు బలరామ ప్రసాద్, పూర్వ విద్యార్థి

చాలా ఆనందంగా ఉంది


కింద కూర్చుని భోజనం చేయడానికి ఇబ్బంది పడే వాళ్లం. మా పాఠశాలకు పూర్వ విద్యార్థుల విరాళంతో భోజన బల్లలు ఏర్పాటు చేశారు. చాలా సంతోషంగా ఉంది.
అంగర నిహారిక, విద్యార్థిని

క్లుప్తంగా

అన్నసమారాధన ఏర్పాటు


అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

మొగల్తూరు: సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మొగల్తూరు కోటరోడ్డులోని నాగదేవత ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమానికి గ్రామంలోని భక్తులు భారీగా తరలి వచ్చి, శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారిని దర్శించుకున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి వసంతోత్సవం


సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తజనం

పాలకొల్లు సెంట్రల్: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారికి పూర్ణాహుతి, త్రిశూలస్నానం, వసంతోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామి వారిని పల్లకీలో ఊరేగిస్తూ కాలువ వద్దకు తీసుకెళ్లి అక్కడ స్వామి వారికి త్రిశూలస్నానం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి ఏడు గంటల ఇరవై నిమిషాలకు స్వామి వారికి శ్రీ పుష్పయాగం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు గుణ్ణం విశ్వేశ్వరరావు, గుమ్మళ్ల కృష్ణ, మోపిదేవి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

చినగోపురంలో తిరునక్షత్ర మహోత్సవం


శ్రీమన్నారాయణుడికి తిరుమంజనం చేస్తున్న అర్చకులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో శ్రీచతుర్భుజ లక్ష్మీతాయార్ల, శ్రీఅష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి (చినగోపురం) ఆలయంలో స్వామి వారికి తిరునక్షత్ర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి బిరుదుకోట శంకర్ తెలిపారు. ఈ ఉత్సవాలు ఐదు రోజులపాటు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో మొదటి రోజు స్వామి వార్లకు పాలు, పెరుగు, తేనె, పండ్ల రసాలు తదితర సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం చేశారు. ఆలయ అర్చకులు కరి పవన్‌స్వామి, పి.రంగనాథస్వామి బ్రహ్మత్వంలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

గోవులకు గడ్డి వితరణ


గోవులకు గడ్డి వితరణ చేస్తున్న పూసల శ్రీను

పెనుగొండ: శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలోని గోవులకు పెనుగొండకు చెందిన ఇండిపికాయల శ్రీనివాస్(పూసల శ్రీను) ఎకరం గడ్డి వితరణ చేశారు. సోమవారం సొంత ఖర్చులతో గడ్డిని ఆలయానికి తరలించారు. గోవుల ఆకలి తీర్చడానికి గడ్డిని అందించిన పూసల శ్రీనుకు ఆలయ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


దంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ అంజయ్య

నరసాపురం: పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల ఇబ్బందులపై దృష్టి సారించామని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య చెప్పారు. సోమవారం కమిషనర్ ఆరో వార్డులో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వార్డుల్లో వీధి దీపాలు, మంచినీటి సరఫరా తదితర అంశాల్లో ఇబ్బందులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 15వ వార్డులో డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ వద్ద పరిస్థితి అదుపులో ఉంచాలని చెప్పారు. పరిశీలనలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ వేంద్ర త్రినాథ్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ఓడీఎఫ్ పట్టణంగా పాలకొల్లు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పట్టణాన్ని బహిరంగ మల విసర్జన రహిత (ఓడీఎఫ్) పట్టణంగా ప్రకటించారని సోమవారం మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి అన్నారు. పట్టణంలో ఎక్కడా బహిరంగ మల విసర్జన చేయరాదని హెచ్చరించారు. ప్రజలు సహకరించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలన్నారు.

ఈ–పంట నమోదు పారదర్శకంగా చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ ఈదా అనిల్‌కుమారి

నరసాపురం రూరల్: రబీ సీజన్‌కు సంబంధించి సాగు చేసిన ప్రతి పైరునూ ఈ–పంటలో నమోదు చేయాలని వ్యవసాయ శాఖ ఏడీఏ ఈదా అనిల్ కుమారి అన్నారు. సోమవారం నరసాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డివిజన్‌లోని మూడు మండలాల వ్యవసాయ, ఉద్యాన శాఖల ఎంపీఈవో లకు రబీ ఈ–పంట నమోదు కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ ఈ–పంట నందు కొత్తగా వచ్చిన మార్పుల గురించి, దాళ్వా పంటలో వచ్చే జింక్ లోపం, దాని నివారణ, ఎరువుల యాజమాన్యం ప్రాముఖ్యత గురించి ఆమె వివరించారు. ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15 వరకూ పంట బీమా నమోదు కార్యక్రమం చేపడతారని, ఈ విషయాన్ని గమనించి, ప్రతి రైతూ పంట నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో మొగల్తూరు, యలమంచిలి ఏవోలు రహీమ్, దేవి, మూడు మండలాల రైతుసేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌జైలు తనిఖీ


సబ్‌జైలులో రికార్డులు పరిశీలిస్తున్న రత్నప్రసాద్

నరసాపురం: సబ్‌జైలులో శిక్షలు అనుభవిస్తూ న్యాయవాదిని నియమించుకుని, బెయిల్ తెచ్చుకునే స్తోమత లేని వారు ఉచిత న్యాయ సహాయాన్ని పొందొచ్చని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల మండల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ చెప్పారు. సోమవారం రత్నప్రసాద్ నరసాపురం సబ్‌జైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడి కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ముద్దాలయిలకు నియమించబడిన ఉచిత న్యాయ సలహాదారులు బాధ్యతగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో నరసాపురం టౌన్ సీఐ యాదగిరి, రూరల్ ఎస్సై టీవీ సురేష్, యలమంచిలి ఎస్సై గురవయ్య, జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

మొగల్తూరు: బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో అబ్దుల రహీమ్ సోమవారం తెలిపారు. వరి కోతలను వాయిదా వేసుకోవాలని, లేదా ఒబ్బిడి చేసుకున్న ధాన్యాన్ని తడవకుండా జాగ్రత్త చేసుకోవాలన్నారు. కోసిన వరి పనలు తడిసిపోకుండా చూడాలని, చేలల్లో నిలిచిన నీరు బయటకు పోయేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

రేషన్ దుకాణాల తనిఖీ


రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీటీ సంధ్య (ఫైల్)

మొగల్తూరు: మండలంలోని పలు చౌక డిపో దుకాణాలను శనివారం తనిఖీ చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ సంధ్య సోమవారం తెలిపారు. మొగల్తూరులో నాలుగు దుకాణాలను, ముత్యాలపల్లి, శేరేపాలెం, కొత్తపాలెం గ్రామాల్లోని రేషన్ దుకాణాలను పరిశీలించి డీలర్లకు పలు సూచనలు జారీ చేశామని ఆమె తెలిపారు. ఆమె వెంట వీఆర్వోలు, తదితరులు ఉన్నారు.

వేధింపుల కేసు నమోదు

ఆకివీడు: భర్త, అత్త మామలు వేధిస్తున్నారని స్థానిక శ్రీనగర్ కాలనీకి చెందిన బోడిగడ్డ పాల్‌కుమారి సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. ఏప్రిల్ 29వ తేదీన యాళ్ల రాజకుమార్‌తో వివాహమైందని అప్పటి నుంచి పలు రకాలుగా వేధిస్తున్నారని ఫిర్యాదు ఇచ్చిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్లూస్‌టీం గొందిలో వేలి ముద్రల సేకరణ

నరసాపురం రూరల్: మండలంలో కొంత కాలంగా వరుస దొంగతనాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా నరసాపురం మండలం గొంది గ్రామానికి చెందిన శీలబోయిన రామకృష్ణ శనివారం బంధువుల ఇంటికి వెళ్లి ఆదివారం సాయంత్రం తిరిగి ఇంటికి చేరుకున్నారు. అయితే ఇంటిలో దొంగతనం జరిగినట్లు గుర్తించి 100 నెంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. రంగంలోకి దిగిన రూరల్ ఎస్సై సురేష్ ఎటువంటి ఆధారాలు దొరకకపోవడంతో సోమవారం క్లూస్‌టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. ఈ దొంగతనంలో సుమారు నాలుగు కాసుల బంగారం, ఐదు వేల నగదు రెండు జతల వెండి పట్టీలు అపహరణకు గురైనట్లు బాధితుడు రామకృష్ణ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

సేంద్రియ కూరగాయలతో ఆరోగ్యానికి మేలు


స్టాల్ వద్ద సేంద్రియ కూరగాయలు కొనుగోలు చేస్తున్న అధికారులు

మొగల్తూరు: రసాయనాలు వాడకుండా జీవామృతం, కషాయాల ద్వారా పండించిన కూరగాయలు తినడం వలన ఆరోగ్యానికి మేలు కలుగుతుందని తహసీల్దార్ కె.రాజకిశోర్ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది స్టాల్‌ను ఏర్పాటు చేశారు. మొగల్తూరు, శేరేపాలెం పంచాయతీల్లోని పలు ప్రాంతాల్లో పండించిన వివిధ రకాల కూరగాయలను, ఆకుకూరలను అమ్మారు. దీంతో అధికారులు తహసీల్దార్, ఎంపీడీవో సీహెచ్ త్రిశూల పాణి, వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్, డీటీ సంధ్య, వసతిగృహ అధికారులు సాగర్, ధారవేణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఈఓపీఆర్డీ నవీన్‌కిరణ్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కె.లక్ష్మీకుమారి, ఉంగరాల రామలక్ష్మి, శీలం మహాలక్ష్మి, గురుజు కనకదుర్గాభవాని, గూడూరి మావుళ్లు, ఆర్.పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

సేవకుడు ఆదర్శంగా నిలవాలి


కేక్ కట్ చేస్తున్న మేడిది జాన్సన్

పాలకొల్లు అర్బన్: సమాజానికి సేవకుడు ఆదర్శంగా నిలవాలని ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి మేడిది జాన్సన్ అన్నారు. పాలకొల్లు పట్టణ, మండల పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక వడలివానిపేట త్రిఏక దేవుని సంఘం పాస్టర్ గొల్ల రాజబాబు చర్చి ఆవరణలో పాస్టర్స్ క్రిస్మస్ ఆరాధన ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జాన్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థ, ఐక్యత, విశ్వాసంతో పరిచర్య అనే మూడు అంశాల మీద సేవకుడు పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్‌ను రెవ.బిషప్ కొమానపల్లి జోసఫ్ రాజ్ కట్ చేసి అతిథులకు పంచారు. కార్యక్రమంలో జేడీవీ ఫౌండేషన్ అధ్యక్షుడు గోగుల మండ రాజేష్ ఖన్నా, హెబ్రోన్ చారిటీస్ డైరెక్టర్ జల్లి సాగర్ ప్రకాశం, రాపాక రత్నరాజు, సనమండ ఎబినేజరు, పాస్టర్స్ ఫెలోషిప్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఐ సెయింట్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ సి.నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): కరాటే విద్యలో మరింతగా రాణించి జిల్లాకు ప్రపంచ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఇటీవల మలేషియాలో నిర్వహించిన కరాటే పోటీల్లో మూడు పతకాలు సాధించిన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం విద్యార్థులను సోమవారం కలెక్టరేట్ ఛాంబర్ నందు ఆమె అభినందించారు. ఈ సందర్భంలో శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మలేసియా దేశంలో జరిగిన కరాటే పోటీల్లో ఈ ముగ్గురు విద్యార్థులతో పాటు 11 దేశాల్లోని 16 మంది ఎంపిక అయ్యారని, వారిలో నేతల అశ్విని, దండే ప్రియ, బత్తుల జెస్సీలు బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించారని తెలిపారు. విద్యార్థులు ఇమ్మానుయేల్ చిల్డ్రన్ హోమ్‌లో వసతి పొందుతున్నట్లు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించాలన్నారు. క్రీడలలో రాణిస్తే వ్యక్తిగత గుర్తింపుతో పాటు జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి ప్రత్యేక గుర్తింపు వస్తుందన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలను సాధించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇమ్మాన్యుయేలు చిల్డ్రన్ హోం నిర్వాహకులు ఎన్‌ఎస్ పాల్, కరాటేలో మెడల్స్ సాధించిన విద్యార్థులు అశ్విని, ప్రియ, జెస్సీలు, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న సేవ్ ద గర్ల్ చైల్డ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు అపుస్మా పాలకొల్లు జోన్ ప్రెసిడెంట్ షాజహాన్ తెలిపారు. సోమవారం స్థానిక ప్రైవేట్ స్కూల్స్ (అపుస్మా) ఆధ్వర్యంలో దీప్తి స్కూల్ నందు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా షాజహాన్ మాట్లాడుతూ పట్టణంలో నిర్వహించనున్న సేవ్ ద గర్ల్ చైల్డ్ కార్యక్రమం అవగాహనలో భాగంగా ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డిసెంబర్ 12న అపుస్మా పాలకొల్లు జోన్‌లో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు ఉదయం పది నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు పోటీలు నిర్వహించనున్నామన్నారు. వ్యాసరచన పోటీలతో పాటు పాటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అపుస్మా సభ్యులు రావూరి అప్పారావు, జానకిరామ్, ఐడియల్ సుబ్బారావు, జోన్ సెక్రటరీ శ్రీరామ్, ట్రెజరర్ భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కోడలిపై అత్త ఫిర్యాదు


భీమవరం: అత్తపై కోడలు దాడి చేసి గాయపర్చిన సంఘటన ఇది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన ఒక మహిళ తన మూడో కోడలు గర్భం విషయంలో తలెత్తిన ఘర్షణలో సెల్‌ఫోన్‌తో కోడలు ఆమె నుదుటిపై కొట్టడంతో గాయాలయ్యాయి. ఆమెను ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రెహమాన్ తెలిపారు.


క్యాన్సర్ రోగికి ఆర్థిక సాయం


క్యాన్సర్ రోగికి ఆర్థిక సాయం అందజేస్తున్న వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు

పాలకొల్లు అర్బన్: మండలంలోని గోరింటాడకు చెందిన ముచ్చర్ల రామలక్ష్మి కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతోంది. వైద్య సహాయం నిమిత్తం వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు రూ.15 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సహాయాన్ని ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు సోమవారం గోరింటాడలో క్యాన్సర్ రోగికి అందజేశారు. విజయ ల్యాబ్ అధినేత కొమ్ముల మురళీకృష్ణ మాట్లాడుతూ సమాజంలోని అనేక మంది పేదలకు ఆర్థిక వితరణ చేస్తున్న వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు అభినందనీయులన్నారు.

పీజీఆర్‌ఎస్‌లో వినతుల వెల్లువ


నరసాపురం: ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఆర్డీవో


మొగల్తూరు: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రాజకిశోర్


పెనుగొండ: రైతులు ఫిర్యాదు చేసిన రహదారి దుస్థితి

నరసాపురం: సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమాన్ని ఆర్డీవో దాసి రాజు నిర్వహించారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల ప్రజలు దరఖాస్తులు అందించారు. మొత్తం 16 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో చెప్పారు. వ్యక్తిగత సమస్యలు, కోర్టు పరిధిలో ఉన్న సమస్యలపై ఎక్కువ ఫిర్యాదులు రావడంతో ఆర్డీవో స్పందించారు. ముందుగా క్షేత్ర స్థాయిలో అధికారులకు ఫిర్యాదు చేసినా పరిష్కారం కాకపోతే డివిజన్ స్థాయిలోకి రావాలని సూచించారు. కోర్టు పరిధిలో సమస్యలు పీజీఆర్‌ఎస్‌లో పరిష్కారం కావన్నారు. ఇదిలా ఉంటే తూర్పుతాళ్లు గ్రామానికి చెందిన గంగిపాముల రామ్‌కుమార్ తన స్థం సరిహద్దు వద్ద నెలకొన్న సమస్యపై ఎన్ని సార్లు కార్యాలయానికి ఫిర్యాదు చేసినా పరిష్కారం కావడం లేదని వాపోయాడు. నరసాపురం పట్టణంలోని ఆదికేశవ ఎంబేరుమానర్ దేవస్థానం కోనేరు శుభ్రం చేయకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా దేవాదాయశాఖ పట్టించుకోవడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ప్రచార ఆర్భాటానికే పీజీఆర్‌ఎస్
పెనుగొండ: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పీజీఆర్‌ఎస్ ప్రచార ఆర్భాటానికే పరిమితమయ్యిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెనుగొండ పెద్దవంతెన వద్ద నుంచి బాపూజీపురం వరకూ రహదారి సమస్యపై ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో ఫిర్యాదు చేసి నాలుగు నెలలు దాటుతున్నా ఆదుకునే నాధుడే కరువయ్యాడంటూ వాపోయారు. పెనుగొండ పెద్ద వంతెన నుంచి బాపూజీపురం వరకూ నరసాపురం కాలువ గట్టు సుమారు కిలో మీటర్ పొడవు ఉంటుంది. కాలువ గట్టు పొడవునా పలువురు రైతులు వ్యవసాయం చేస్తున్నారు. వీరితో పాటు బాపూజీపురం వాసులు అత్యవసర పరిస్థితుల్లో ఇదే రహదారిలో రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి మొత్తం తుప్పలు పెరిగిపోయాయి. దీంతో మందు బాబులకు అడ్డాగా మారింది. మద్యం సేవించి ఖాళీ సీసాలు ఈ రహదారిపైనే పగలకొడుతుండడంతో రైతులు, బాపూజీపురం వాసులు రాకపోకలకు పలు అవస్థలు పడుతున్నారు. సీసా పెంకులు గుచ్చుకుని పలువురు గాయాలపాలవుతున్నారు. సాగు చేసిన పంటను మిల్లులకు చేర్చుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, డిప్యూటీ సీఎంకు వినతి పత్రాలు సమర్పించామని రైతులు చెబుతున్నారు. నాలుగు నెలలు దాటినా చర్యలు శూన్యమని రైతులు వాపోతున్నారు.

మొగల్తూరులో రెండు అర్జీలు
మొగల్తూరు: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ కె.రాజకిశోర్ తెలిపారు. మండలంలోని కొత్తకాయలతిప్ప గ్రామంలో రహదారికి ఆనుకుని ఉన్న కరెంట్ స్తంభాలను మార్చాలని ఒక ఫిర్యాదు, కాళీపట్నం పడమరకు చెందిన అనిశెట్టి ప్రపూర్ణ చైతన్య మరో ఫిర్యాదు అందజేసినట్లు ఆయన తెలిపారు.కార్యక్రమంలో ఎంపీడీవో త్రిశూల పాణి, ఈవోపీఆర్డీ నవీన కిరణ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్‌రావు, పలు శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్పందన కరువు


పీజీఆర్‌ఎస్‌తో పాటు, ఏడు శాఖలకు వినతి పత్రాలు సమర్పించాం. నాలుగు నెలలు దాటుతున్నా స్పందన లేదు. అధికారులు తక్షణం స్పందించి రైతులును ఆదుకోవాలి.
తాడి వెంకట సత్యనారాయణరెడ్డి, రైతు, పెనుగొండ

భక్తుల తీవ్ర ఇబ్బందులు


పట్టణంలో ఆదికేశవ ఎంబేరుమానార్ దేవస్థానం ప్రత్యేకమైనది. దేశం మొత్తంగా తమిళనాడు పెరంబదూర్‌లోనూ, నరసాపురంలోనూ రెండు చోట్లే ఇలాంటి దేవాలయాలు ఉన్నాయి. ఆలయ కోనేరు చెత్త పెరిగిపోయి దారుణంగా తయారైంది. దేవాదాయశాఖకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. అందుకే పీజీఆర్‌ఎస్‌లో ఆర్డీవోకు ఫిర్యాదు చేశాం. వేలాది మంది భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇది చాలా విశిష్టమైన ఆలయం.
–పోలిశెట్టి సాంబ, జనసేన నాయకుడు

గోపిమూర్తి విజయంపై హర్షం

యలమంచిలి: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొర్రా గోపిమూర్తి విజయం సాధించడంపై యలమంచిలి మండల యూటీఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గోపిమూర్తి స్వగ్రామం యలమంచిలి మండలంలోని నారినమెరక పంచాయతీ గమళ్లపెంటని తెలిపారు.
పెనుగొండ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బొర్రా గోపి మూర్తి విజయంతో ఆచంటలో యూటీఎఫ్, ప్రజా సంఘాల నాయకులు సంబరాలు చేసుకున్నారు.యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి రొక్కాల కమల్‌నాథ్, కోశాధికారి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.